గీత్‌మాల క్యాసెట్ గెలుపొందిన కథ

# ఆదర్శం అంచున...

అయ్యగారి కనకవల్లి

గుడివాడ ప్రథమశ్రేణి గ్రంథాలయం
నిర్వహించిన శారద స్మారక కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన

శారదా! అన్న పిలుపుతో వెనక్కి తిరిగి చూశా. అనుకోకుండా కనిపించింది సీత. ముద్దుల మూటగట్టే బుల్లి పాపాయి సీత చెయ్యి పట్టుకునుంచుంది. చాలా కాలానికి కనిపించిందన్న సంతోషంలో ఏం మాట్లాడాలో కూడా తెలియలా. అబ్బో బుల్లి సీత వెలిసిందే అంటూ దగ్గరకు తీసుకున్నా.

'నా పేరు మాధవి' అంది ముద్దుగా

'మీరీ వూళ్లోనే వుంటున్నారా?' ఆశ్చర్యంగా అడిగింది సీత.

'అబ్బే ప్రభుత్వంవారు ట్రైనింగ్‌కి పంపించారు. దైవికంగానే దర్శనమయింది. మీ వారికి ప్రమోషను వచ్చిందా?' అన్నా

'సరెలే అవన్నీ ఇంటికి వెళ్ళి మాట్లాడుకుందాంలే. రిక్షా ఎక్కు' అంది నిర్లిప్తంగా. దారి పొడుగునా మాధవి ఎన్నో కబుర్లు చెప్పింది.

'మీ ఇంట్లో టెలిఫోను వుందా?' అంది పాప.

'లేదే'

'మా ఇంట్లో వుంది. నేను రోజూ మా అమ్మతో మాట్లాడుతా' అంది. ఒక్కసారి నా మనస్సు ఫ్లాష్ బ్యాక్‌లా గతంలోకి పరిగెత్తింది. సీత ఎక్కువగా డిబేట్లల్లో పాల్గొనేది. వివాహాన్ని గురించి ఎన్నో వ్యాసాలు వ్రాసేది. కట్నమిచ్చి పెళ్ళి చేసుకోవడమనే ప్రశ్న లేదనేది.

సీత కోరుకున్నట్లుగానే ఆమె నారాధించే వ్యక్తి దొరికాడు.

ఇద్దరూ ఒకే డిపార్టుమెంటవడంతో ఒకరి భావాలొకరు తెలుసుకునే అవకాశం లభించింది. అతని పేరు చెబితే చాలు పరిసరాలనే మరిచిపోయేది. మనసులోని సంతోషమంతా మొహంలోకి వచ్చేసి అక్కడితో ఆగక కళ్లల్లోకి తొంగిచూస్తే ఆ కళ్లు వింత కాంతులతో తళతళా మెరసిపోయేవి. బుగ్గలు సిగ్గుల మొగ్గలై గులాబీలను మరపించేవి.

రామారావు మాత్రం ఎంతమందిలో వున్నా ఆమె కోసం వెతుకుతుంది. ఆ కళ్లల్లో ఎన్నో భాష కందని భావాలు. ఎంతో ఆప్యాయత కనిపించేది. టెలిఫోన్ రింగయితే చాలు తన కోసమేనని చెవులు రిక్కించుకుని ఎదురు చూసేవాడు. వారిద్దరికి రాయబారి, ఆత్మబంధువు టెలిఫోనే. ఆఫీసు అయిపోగానే బస్సు స్టాపుకి వచ్చి కాసేపు కబుర్లు చెప్పకుని, బస్సెక్కించనిదే వెళ్ళలేక పోయేవాడు. ఇంతటి ప్రేమమూర్తులకు వివాహం చేసుకుందుకు కొన్ని సంవత్సరాలాగవలసి వచ్చింది.

''ఏమిటి మీ రామయ్య వివాహానికెందుకు వెనకాడుతున్నాడు?''

'పోనే తల్లీ నీ కన్నీ అనుమానాలే. వాళ్లన్నయ్యకింకా పెళ్ళి కాలేదు.

'పాపం ఆయన కెవరూ దొరకలేదట్లుంది?'

'అది తెలియదు కాని, వాళ్ళకింకో చెల్లెలుంది. ఆమె పెళ్లయితే కాని మా పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వరు' తెలిసిందా అంది గట్టిగా.

'అయితే ఆవిడకు సంబంధాలు చూస్తున్నారా?'

'సంబంధంతోపాటు పెళ్ళికి కావలసిన డబ్బు కూడా జాగ్రత్తపెడుతున్నాం' అంది ఆనందంగా.

'అబ్బో అప్పుడే ఇంటి బాధ్యతలు కూడా తీసుకుంటున్నావన్న మాట. ఇంకొక్క సందేహం ఈ సంగతి మీవాళ్ళకు తెలుసా?

'చూడు శారదా నేను ఏ పనిచేసినా రహస్యంగా చెయ్యను. రహస్యమన్నది నా డిక్షనరీలో లేదు. నా భావాలు ఇంట్లో అందరికి చెప్పాను. నచ్చిన అబ్బాయిని చేసుకుంటానని చెప్పాను. ఇంట్లో అందరికి చూపించా. అందరూ ఓటు వేశారు' అంది గర్వంగా.

సీత జీవితంలో మరో రెండు వసంతాలు తొంగి చూచి వెళ్ళిపోయాయి. ఎక్కడా పెళ్ళి మాట వినపడ్డం లేదు. విసిగిపోయి మళ్ళీ అడిగా 'ఎంత కాలమిలా ఎదురు చూస్తావు?' అని.

'నువ్వేం భయపడకు శారూ. ఈ తియ్యని నిరీక్షణలోని ఆనందం అనుభవిస్తేగాని తెలియదు'

కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదంటారు. చెల్లెళ్ల పెళ్ళిళ్ళయిపోవడంతో మా సీత కూడా పెళ్ళికూతురయింది.


పురోహితుల మంత్రాలతో, తల్లిదండ్రుల దీవెనలతో, స్నేహితుల హాస్యాలతో, మంగళవాయిద్యాల మోతలో రామారావు సీత మెడలో మూడుముళ్ళు వేశాడు. అపురూపమయిన సీతారాములు దివ్య విగ్రహాలను వారికి పెళ్ళి కానుకగా అందించాను. 'నిన్నటి వరకు మీరు వట్టి రామారావువే. నేటి నుంచి మీరు సీతారాములు. కాదు కాదు సీతాపతి. మీ దాంపత్యం కూడా అలా ఆదర్శవంతంగా వుండాలని' చెప్పి వీడ్కోలు తీసుకున్నా.

వాటికి నేడు మళ్ళీ సీతను చూడడం తటస్థించింది. కాని, ఎందుకో సీత ముఖంలో మునుపటి చలాకీతనం లేదు. కళ్ళల్లో ఏదో నిరాశ. బహుశా ఇంటిపని, ఆఫీసు పనులతో కాస్త నీరసపడిందేమోనని సరిపెట్టుకున్నా.

రిక్షా ఇంటి ముందాగడంతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చా. మాధవి ఒక్క ఉదుటున ఇంట్లోకి పరుగెత్తింది.

'ఇల్లు చాలా నీటుగా వుంది' అన్నా.

'ఇల్లు నీటుగా లేకపోతే అమ్మ కేకలేస్తుంది. మీరయినా సరే ఇక్కడ తుక్కు పారపోస్తే మీచేతే తీయిస్తుంది' అంది పాప ముద్దుగా.



'ఒక్క క్షణం ఇలా కూర్చో కాఫీ తెస్తాను. కాస్త రిలాక్స్ అవుతుంది' అంటూ వంటింట్లోకి వెళ్ళింది. టిఫిను, కాఫీ తెచ్చింది. కాఫీ తాగుతూ నవ్వాను.

'ఏం అమృతంలా వుందా?

'నీకు గుర్తుందా- ఎప్పుడు కాఫీ తాగినా చిన్నప్పుడు మనం కాచుకు తాగిన అమృతంలాంటి కాఫీ గుర్తొస్తుంది'

'నిజంగా అమృతంలాంటి మాట చెప్పావంటూ తనూ నవ్వింది.

'ఇప్పుడు చెప్పు. ఏమంటున్నాడు మీ సీతామానస చోరుడు. ఏమిటి విశేషాలు? కుతూహలంగా అడిగాను.

'ఏముంది పట్టుకెళ్ళిన మనస్సును పెట్టెలో పెట్టి తాళం పెట్టేశాను. ఆయన వాళ్లదగ్గర, నేను మా అమ్మ దగ్గర వున్నాం.'

అంటే మళ్ళీ పురిటికా. మాధవి తమ్ముడు కావాలని పేచీ పెడుతుందా?

'కాదు పొమ్మంటే పుట్టింటి కొచ్చా'

'ఏమిటి వేళాకోళమా?'

కాదు. పచ్చి నిజం. అంటే ప్రశ్నార్థకంగా చూశాను.

'ఏముంది ఇంటింటి కథే మా ఇంట్లోనూ. అత్తగారు అన్న పదంలో ఏం మహత్తుందో కాని కోడలుని చూసేసరికి కుతకుతలాడుతుంది కొత్త బియ్యం అన్నంలా. ఇంట్లో పనులన్నీ చేస్తేకాని గడప దాటడానికి లేదు. వంటచేసి పెడితే ఆమెకు నచ్చదు. అసలు నా రాకే ఆమెకంతగా నచ్చలేదేమోననిపిస్తుంది.'


'ఏం కోరి ఎన్నో సంవత్సరాలు నిరీక్షించి చేసుకున్నావు కదా. నువ్వే సర్దుకుపోతే మంచిదేమో.

'అయ్యో రాత నాకు చేతనైనవన్నీ చేశాను. ఆమెకేమి కావాలో అడిగి మరీ చేసేదాన్ని. మీరు కూర్చోండి అత్తయ్యా అని, అన్ని పనులూ నేనే చేసేదాన్ని. ఆయన ఇంట్లో వున్నంతసేపు తలకు నొప్పిని కట్టుకు పడుకునేది. ఆయన బయటకు వెళ్ళగానే నువ్వు ఇంట్లో పాదం పెట్టావు నాకు వంట్లో బాగుండకుండా పోయింది. వాడికేం మందు పెట్టావో నీ కొంగు పట్టుకు వదలడు. నాకేం మందు పెడతావో అని రాగాలు తీసేది. అదే చేతనయితే ఆమె అలా అనగలిగేదా? చెప్పు' అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

'పోనీ ఆవిడనే పండమనకపోయావా?'

'నేను లేవలేను నుండి మరీ వెళ్ళు' అంటుంది. నే చేసిన సాయం కూడా మరచిపోయిన ఆడపడుచు ఆమెకు వంతపాట పాడుతుంది.

'ఏమంటాడు రామయ్య'?



ఆయన ఇంటికి వచ్చేసరికి ఫైలు పుచ్చుకు రెడీగా వున్న గుమాస్తాలా కావలసినన్ని నేరాలు చెప్పేసేవారు. నేనేదయినా చెబుదామన్నా అవకాశమిచ్చేవారు కాదు. ఎప్పుడూ ఎడమొహం పెడమొహమూనూ అసలెందుకిలా జరుగుతోందని ఎప్పుడూ ఆయన ఆలోచించినట్లు కనపడదు. మా ఇద్దరి మధ్య పెళ్ళికి ముందున్న నవ్వులు, కబుర్లు, హాస్యం అన్నీ తెరచాటుకి వెళ్ళిపోయాయి.

ఒక్క క్షణం చూడకపోతే వుండలేని వాళ్ళం చూసినా మాట్లాడుకోలేని పరిస్థితి ఏర్పడింది. బహుశా పూర్వజన్మ శత్రుత్వమీ రూపంలో వచ్చిందేమో? ఓ రోజు ధైర్యం చేసి అడిగా, మీ జీతం వాళ్ళకిచ్చేయండి. మనం వేరే వుందామని.

"ఏమనుకొన్నారో మరి నువ్వు కొన్నాళ్ళు మీ యింట్లో వుండు. కొంత విశ్రాంతిగా వుంటుంది. వట్టి మనిషివి కూడ కాదు కదా అని బుజ్జగించి పంపేశారు."

"అప్పటి మంచి మళ్ళీ రాలేదా?" ఆతురతగా అడిగాను. రెండు మూడు నెలలు గడచిపోయాయి. నా వుత్తరాలకు కూడా జవాబు లేదు. తగూలో, పేచీలో అక్కడే వుందాం అనుకొని వెళ్ళా. అనుకున్నంతా అయింది. మనసులు ఇది వరకే మూసుకుపోయాయి. తలుపులు కూడా మూసేశారు. అలాగే గుమ్మంలో కూర్చున్నా. ఎంతకీ వెళ్ళకపోవడంతో మా అత్తగారు బయటకు వచ్చి మా అబ్బాయి నిన్ను యింటిలోకి రాని వ్వద్దన్నాడని చెప్పి లోపలికెళ్ళి తలుపు వేసేసింది. నిండు గర్భవతిని- చేసేదేమీ లేక స్నేహితురాలింటికి వెళ్ళా.





మద్రాస్ భారతీ విద్యాభవన్‌లో ఇటీవల తెలుగుమణి విద్వాన్ శ్రీ బి.వి.ఎస్.ఎస్. మణి షష్టిపూర్తి సందర్భంగా మణి దంపతులను శ్రీ పి.వి. రమణయ్యరాజా దంపతులు సన్మానించినప్పుడు తీసిన ఛాయాచిత్రం

మెటర్నటీ లీవు పెట్టి యింటికి చేరా.''

''అంత గాఢంగా ప్రేమించుకున్న మీ రింతగా ఎలా విడిపోయారో'' అన్నా బాధగా.

''ఏళ్ళతరబడి కలల ప్రపంచంలో మునిగి, తేలిన మేము పట్టుమని పది నెలలు కూడా వైవాహిక జీవితానందాన్ని అనుభవించలేకపోయాము. తల్లిని కాబోతున్నానంటే ఎంత సంతోషిస్తారో. సినిమాలలోలా ఎలా ఉక్కిరిబిక్కిరి చేస్తారో అనుకున్నా. అదేమీ లేదు సరికదా, విననట్టే వెళ్ళిపోయారు. పాప పుడితే మళ్ళీ ఒకటవుతామేమోనని ఆశపడ్డా. పాప పుట్టగానే ఉత్తరం వ్రాశా. పాప చాలా అందంగా వుందని, అంతా మీ పోలికేనని ఒక్కసారి చూసివెళ్ళమని. రాలేదు సరికదా, ఆ వూరి నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. నేను జాయినయ్యాను.

పాపకు మాటలు కూడా వచ్చాయి. నాన్న అంటోంది. ఎప్పుడు వస్తారు? అసలు పాపను చూడకుండా ఎలా వుంటున్నారు? పోనీ నేనేమి చేస్తే మీకు నచ్చుతుందో వ్రాయండి అని మళ్ళీ వ్రాశా.

''ఈ మాటు వచ్చాడా?'' అడిగా ఆతురతగా.

''లేదు. వెంటనే జవాబు వచ్చింది. ఉద్యోగం మానేస్తేకాని ఇంట్లో అడుగుపెట్టే అవకాశం లేదని.''

''ఎంత మోసం- ఇంతకాలం నువ్వు లేనిదే బ్రతకలేమని, తెచ్చిన డబ్బంతా వాడుకొని, ఇప్పుడు ఉద్యోగం మానెయ్యాలా?'' అన్నా అసహనంగా.

''నాకే ఆధారం కూడా లేకుండా చేసి అప్పుడు పొమ్మంటే దీన్ని ఎలా పెంచను? ఇప్పుడు చెప్పు నా తప్పేమిటో?

''ఇలాంటి వాళ్ళను కోర్టు కీడవాలి.''

''చివర కదీ జరిగింది. ఆయన పాపను చూసింది కోర్టులోనే. పాపను ఎత్తుకుంటారని, మనసు విప్పి మాట్లాడుతారని ఆశపడ్డా. ఏం తప్పు చేశానని ఇలా చేశారు? మన ఆశలూ, ఆశయాలూ అన్నీ, మంట కలిపేశారా? మనం గడిపిన మధురక్షణాలను ఎలా మరచిపోయారు? డబ్బు కావాలంటే మీ జీతమిచ్చెయ్యండి. అంతేకాని పాపనూ, నన్నూ అన్యాయం చెయ్యకండి. పాప నాన్న ఎందుకు రారమ్మా అని అడిగితే ఏం చెప్పను? అని కోర్టులోనే గట్టిగా ఏడ్చేశా. అయినా ఆ పాషాణ హృదయం కరగలా. ఇప్పుడు చెప్పండి మీ కెవరు మందు పెట్టారో? అన్నా'' అన్నిటికీ శిలా విగ్రహమే-

''మరి కోర్టు ఏమంది?''

''కోర్టు ఏమంటుంది? చట్టాలేమి చేస్తాయి. విడి పోతామంటే విడాకులిస్తాయి. మమకారాన్ని, మమతలను పెంచగలవా? సుఖ శాంతులనందించగలవా? మానసికంగా మార్పు రావాలేకాని, ఎవరు చేసేదిఏమీ లేదు.''

ఇంతలో లోపల నుంచి ఒకమ్మాయి వచ్చింది 'కూర్చో' అంది సీత.

''ఈ అమ్మాయి పేరు సుశీల. అత్తవారింట్లో బాధలు పడలేక కాలవలో పడబోతుంటే తీసుకొని వచ్చా. పుట్టినవారందరిని ఏదో ఒక రోజు మృత్యు దేవత తీసుకొనిపోతుంది. అందుచేత మనము ప్రత్యేకంగా ఆవిడ నాహ్వానించవక్కర లేదు.''

''జీవితంలో ఎదురయ్యే సుఖాలకు ఎలా ఆనందిస్తామో, అలాగే ఎదురయ్యే సమస్యలనుకూడా ధైర్యంగా ఎదుర్కోవాలి. జీవితంలో అన్యాయం చేసిన వారికి గుణపాఠం చెప్పాలేకాని, పిరికివాళ్ళలా వాళ్ళ మూర్ఖత్వానికి బలికాకూడదని నచ్చచెప్పి ఇక్కడకు తీసుకొని వచ్చాను. ఇప్పుడా అమ్మాయి టీచరుగా పనిచేస్తూ తన బ్రతుకు తాను బ్రతుకుతోంది'' అంది సీత తృప్తిగా.

''అవునమ్మా ప్రాణం తీసుకుందామనుకున్నా. నాకు పునర్జన్మ ప్రసాదించి బతుకు దారి చూపించిన పుణ్యాత్మురాలని చేతులు జోడించి నమస్కరించింది'' సుశీల.

ఇంతలో నూతన దంపతులు వచ్చి సీత పాదాలకు నమస్కరించారు. ఇద్దరినీ మనసారా దీవించింది.

''ఈమె బాల వితంతువు. చదువు లేదు. డబ్బు లేదు. సవతి తల్లి పెట్టే బాధలు పడలేక నా దగ్గర కొచ్చింది. ఈమెకు కుట్లు, అల్లికలు నేర్పించాము. అదృష్టవశాత్తూ మరో టైలర్ ఈమెను వివాహం చేసుకుంటానన్నాడు. పెళ్ళి కూడా నేనే చేశాను'' అంది సీత.

''నిద్దర మంచం మీదునుంచి లేవగానే దేముడితో పాటు మా సీతమ్మ తల్లికి కూడా నమస్కరించి మరీ పనిచేసుకుంటామమ్మా.''

''మేమే కాదమ్మా- ఇంకా ఎందరో ఈమె నీడను చల్లగా బతుకుతున్నారు'' అన్నారాదంపతులు.

''అన్నీ బాగానే వున్నాయి. మరి నీ సంగతి?'' అన్నా.

''నా జీవితాన్ని దిద్దుకోలేకపోయినా, ఎందరో అభాగ్యుల జీవితాలను చక్కదిద్ది బతకడానికి మార్గం చూపించిన సంతృప్తి చాలు'' నాకు.

''ఏళ్ళ తరబడి పెళ్ళికోసం నిరీక్షించానానాడు. ఆయన రాకకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నానీనాడు. ఎప్పటికయినా నేను సీతారాఘులనే అంది'' కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

''సీత పేరు పెట్టినందుకు నీకు బాధలు తప్పలా. ఇందరికి బతుకు తెరువు చూపించిన నీ జీవితం ధన్యం. త్వరలో నీ జీవితంలో కూడా వసంతం వస్తుందని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నా.''

''అమ్మా నాన్నగారిని నేను తీసుకొని వస్తాగా, నువ్వేం బాధపడకు'' అంది మాధవి. అందరి మనస్సులనూ ఆనందపరుస్తూ.

## అర్ధాంగి

ఈ ప్రపంచపు గజిబిజిలో
ఒక్కో చిక్కుముడి విప్పుకొంటూ
నన్ను నేను ఏనాటికానాడు
ఆకళించుకొంటున్నా
జీవితం లబ్జిబా లెక్కలో
వెతకబోతే చుట్టుకుపోయిన తీగలా!
ఒక ''ఎక్స్'' (ఇంకా తన పేరు నాకే తెలియదు)
ఇవాళో రేపో ఏదో నాడు
మా గుమ్మంలో అడుగిడుతుందిట!
వచ్చి రాగానే తనూ నేనూ
ఓ ప్రపంచ మౌనాముట!
''నీపై అన్ని హక్కులు నావే సుమా!'' అన్న
ధీమా తనదిట!
చిర్నవ్వుతోనే నన్ను మంత్రించేస్తుందిట!
నేను ''నిన్ను ప్రేమిస్తున్నాను'' అని
అన్నానో లేదో
ఆమె రెప్పలార్పుతుందిట చిత్రంగా!
నా కవి ప్రేమకే, కామానికే నడుమ
గడియ పడని తలుపులట!
నన్ను నేను కోల్పోయి వెతుకులాడితే,
తనలో స్ఫురిస్తానట!
నిజమే, అర్ధాంగి అంటే -
''అర్థ'' వంతమైన జీవితానికో
పరమార్థం;
పరిపూర్ణతనిచ్చే మరో సగం

- ఎస్.ఎ.రవూఫ్